# ఆపరేషన్ అనుభవాలు

ఈ వ్యాసం ఒకానొక సున్నితహృదయుని ఆపరేషన్ అనుభవాల్ని చక్కగా చిత్రిస్తూవుంది. మేజరు ఆపరేషన్‌గండాన్ని అనుభవించి తేలడం పునర్జన్మ ఎత్తడమే.

రచయిత :

## బాబుజీ’

అసిస్టెంట్సుతో కూడ సర్జన్ గదిలోకి వచ్చినాడు. నాచుట్టు ఎవరిని చూచినా ధవళవస్త్రధారులే. సర్జను నన్ను పరీక్షిస్తుండగా, నన్ను చూచి కొందరాశ్చర్యపడ్డారు. మరికొందరు నా ముగం చూచి జాలిపడ్డట్టు కనుపించారు. పరీక్ష అయింది. ‘మరేం భయంలేదండీ’ అని నాకు ధైర్యంచెప్పి సర్జనూ, అనుచరులూ వెళ్ళిపోయ్యారు.

మళ్ళీ కొంతసేపటికి ఇంజక్షనివ్వటానికని అసిస్టెంటు వచ్చాడు. అసలు ఆపరేషన్‌కంటె అంతకుముందు జరిగే తంతులే గుండె పగలగొట్టేవిగా ఉంట వన్న సంగతి నాకు రూఢి అయింది.

ఇంజక్షన్ సూది గుచ్చినప్పుడు చురుక్కుమంది. గభీమని అరఖుముంచిన దూదిపెట్టి జబ్బ రుద్దేశి సద్దేశాడు డాక్టరు. ఇద్దరు నర్సులు వచ్చి, నాకాళ్ళూ చేతులూ పట్టి ఎత్తి స్ట్రెచర్‌పైన పండుకో బెట్టారు. భద్రంగా నన్ను శుభ్రమయిన వస్త్రంతో కప్పివేశారు. బండీ తోలుకువెళ్ళి ఆపరేషను హాల్‌కి చేర్చారు.

ఒక మూలని రకరకాల ‘ఇన్‌స్ట్రుమెంట్లు’ తళతళలాడుతూ కన్నులు మిరుమిట్లు గొల్పుతున్నాయి. వాటి నన్నిటినీ ఉడకబెట్టి చక్కా ఒక పళ్ళెంలో అమర్చింది నర్సు. ‘ఈ కత్తులతో శేనోయ్ అబ్బాయ్!—నిన్ను ముక్కముక్కలుగా కోసి చిత్రవధ చేయటం’ అని నాహృదయంలో ఒక వాణి పలికినట్టనిపించింది.

‘పేషెంట్‌ని తీసుకురండి’ అన్నాడు అసిస్టెంట్ సర్జను.

చిటికసేపట్లో బండీ లోనికి వెళ్ళింది—

అక్కడ—చేతులు కడుక్కునే నాలుగు బేసిన్లున్నాయి. నాలుగు బేసిన్లవద్దా నలుగురు సర్జన్లు సిద్ధంగా నిలబడి వున్నారు.

ఇంతలో పెద్ద సర్జను వచ్చాడు వచ్చి—‘నీ కేం భయంలేదయ్యా పంతులూ!’ అని అభయవాక్యాలు పలికాడు.

ఇందుకు ఆయనకు కృతజ్ఞత తెలుపుకొన్నాను. కాని, ఆమాట విన్నప్పటినించీ నాహృదయంలో ఎన్నెన్నో యోచనలు రేకెత్తాయి.

మత్తుమందిచ్చే ఆయన వచ్చాడు :

‘వీరు దీన్ని పీల్చారంటే మీకు మంచి నిద్రపడుతుంది. చాలా హాయిగా వుంటుంది...’ అన్నాడు. ఈ సలహా నాకు హితవుగానే తోచింది, బాగుందనుకున్నాను.

నన్ను టేబిల్‌పైన పండుకో బెట్టమన్నాడు సర్జను. పండుకో బెట్టారు. నాకు ఎదట కనిపించే లైట్లు కళ్ళల్లో సూదులు పొడిచాయి.

అసిస్టెంట్ సర్జను నాబట్ట తొలగించి ఆపరేషన్ చేయాల్సిన భాగం కత్తితో నునుపు చేశాడు. నాకు కితకితలెట్టింది. తరువాత ఆ భాగం కడిగి తుడిచివేశాడు.

సర్జన్లు ఇద్దరు ఆపరేటింగుగౌన్లు వేసుకునివచ్చారు. మహర్షులవలె ఉన్న వీరి దర్శనం నాకు భయంగా తోచింది.

ఇక కొద్ది నిమిషాల్లో నాకు స్పృహ తప్పిపోతుంది. మళ్ళీ మెలుకువ వస్తుందా!—ఇదీ నామనసులో ఆలోచన.

ఆపరేషను కావలసినభాగం మాత్రం తప్పించి నన్ను కూడా తెల్లవస్త్రాలతో కప్పివేశారు. గదిలో అందరూ రుద్ధకంఠాలతో ప్రసంగించుకుంటున్నారు. సర్జను ఏమేమో ఆజ్ఞాపిస్తున్నాడు, అసి

స్టెంట్సు ముకుళితహస్తులై వింటున్నారు.

మత్తుమందు ఇచ్చేఆయన ముందు నా ముక్కుకి వేసెలిన్ రాశాడు. నాకు దిమ్ముగా వున్నట్టు తోచింది. గుండె గబగబ కొట్టుకోజొచ్చింది. దృష్టిమందగించింది...

నన్ను గట్టిగా అంకెలు లెక్కెట్టమంటున్నారు.

నాకు తల తిరిగినట్టయింది.

'ఆఁ—గట్టిగా వూపిరి తీసి, మళ్ళీ సరిగా లెక్కపెట్టండీ—వన్...టూ...త్రీ...' అని మత్తుమందు ఇచ్చే డాక్టరు.

పోతూపోతూవున్న స్పృహతో ఏమో ఆలోచిస్తున్నది నామనస్సు.

'గట్టిగా లెక్కెట్టండి' అని మళ్ళీ డాక్టరు.

లోపల ఆలోచన సాగిస్తూనే పైకి లెక్కపెడుతున్నాను. వేయిన్నొక్క యోచనలు నాబుర్రలో గిర్రున తిరిగిపోయాయి. చూపు మంటగించింది. గలగలమని సర్జన్లు చేసే ఇన్‌స్ట్రుమెంటుల చప్పుడు ఏదో లయవేసినట్టు వినపడింది. ఉన్నట్టేవుండి శ్వాస పీల్చటమే కష్టమయింది. ప్రపంచము యావత్తూ నాకళ్ళముందు నడయాడజొచ్చింది. పచ్చటి కిరణాలు కళ్ళల్లో పొడిచాయి. గొంతులో మంట. వంటి కండరాలన్నీ వణికాయి. ఊపిరాడలేదు. నా ఈ బాధలు నివర్తిచేయగల ఆ మరణదేవత ప్రత్యక్షమయితే బాగుండు ననిపించింది.

వాళ్ళ మాటలధ్వని వినబడుతున్నది — కాని, మైలుదూరంనించి మాటాడుతున్నట్టుంది. చెవుల్లో హోరు ఆరంభించింది. ఇక ఈ లోకంతో సంబంధం వీడిపోతున్నట్టు తోచింది.

గుండెలో కొట్టే ఒక్కొక దెబ్బకు భూకంపం వచ్చినట్టుండేది. చివరకు, నీటిలో మునిగిపోయినవానివలె ఉక్కిరి బిక్కిరయింది. క్రమంగా కళ్లు చీకట్లు క్రమ్మినాయి.

మళ్ళీ చెవులకు ధ్వని వినిపించింది. 'స్పాంజ్'— 'కోచర్ క్లారిప్స్...' అనే మాటలు గూబల్లో దూరంనించే ప్రతిధ్వనించాయి.

'మరికొంచెం ఇయ్యి. తెలివొచ్చేస్తుంది...' సర్జన్ అనటం బాగా వినపడింది.

నే నేం మాటాడదామన్నా నోట మాటరాదు! ఈ యమచెరనుంచి ఎట్లా అయినా తప్పించుకుపోదామని శాయశక్తులా యత్నించాను. ఊహు ఎంతమాత్రమూ వీల్లేకపోయింది. నాశరీరం సిమెంటులాగ కొయ్యబారిపోతున్నట్టు తోచింది.

చెవుల్లో హోరు, గుండెలో సుత్తిదెబ్బలు– ఇవన్నీ ఎక్కువై పోయాయి. కదలటమే కష్టసాధ్యమైపోయింది నాకు, ఇక ఈ శరీరం అహల్యకుమోస్తరుగా శిలాప్రతిమ అయి వూరుకుంటుందని నిశ్చయించుకున్నాను,

ఈ అవస్థలో ఒక బ్రహ్మరాక్షసివచ్చి గట్టిగా పీక నులుముతున్నట్టు అనిపించింది. ఇన్నాళ్ళూ ఎంతగానో బతికి ఇట్లాటి దిక్కుమాలిన చావు వచ్చిందేమీ అని మనస్సు ఖేదపడ్డది.

అంతా అంధకారబంధురమయిపోయింది. స్పృహ తప్పింది.

ఆ స్థితిలో– కడుపులో పుట్టెడు వూహలు! కాని,...పైకి చెప్పుకోడానికి మాటరాదు.

నా విషాదభావాలన్నీ ఆమత్తుమం దిచ్చినాయనకు ఏం తెలుస్తాయి? నాహృదయమే ఆతనికి తెలుస్తే, మత్తుమందు యివ్వటానికి చేతులొస్తాయా?

... ... ...

వంట్లో యేం బాగలేదు. విదాహం. గొంతుమంట. చెప్పలేని శరీరబాధ. ఉన్నదల్లా ఒక్కటే సుగుణం : నిద్దరపడుతుంది.

దూరంనించి ఏదో పరిచయకంఠం వినబడింది. ఆధ్వని నాదగ్గిర దగ్గిరసా వస్తుంది. చప్పట చరిచిన చప్పుడు. కళ్లు విడ్డాయి. చూచేసరికి, దీనస్వరంతో—

'నాయనా! ఆపరేషన్ అయిపోయిందిరా, తండ్రీ!– మెళుకువొచ్చిందా...' అని మా అమ్మ.

కలగన్నట్టనిపించింది నాకు.

నే నెక్కడున్నానో నాకే తెలియదు.

ఇంకా ఆపరేషన్ టేబిల్ మీద వున్నాననే నావుద్దేశం. కాని, తీరా చూస్తే నా చిన్న గదిలో నా పక్కమీద నే పండుకుని వున్నాను!—